

కేసుల విచారణ వేగవంతం చేయాలి

కేసుల పరిష్కారానికి న్యాయవాదులు కృషి చేయాలని జిల్లా ప్రధాన న్యాయ మూర్తి భీమారావు పేర్కొన్నారు. - 8లో



సైన్స్‌పై మక్కువ పెరగాలి

ఈనెల 28న జాతీయ విజ్ఞాన దినోత్సవం సందర్భంగా పోస్టర్లను కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఆవిష్కరించారు. - 8లో



స్త్రీ,శిశు సంక్షేమమే ధ్యేయం

గర్భిణులు, బాలింతలకు అంగన్‌వాడీ కార్యకర్తలు అందుబాటులో ఉండాలని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు పేర్కొన్నారు. - 8లో

న్యూస్‌రీల్

ఆకతాయికి దేహశుద్ధి



ఆకతాయిని స్తంభానికి కట్టిన స్థానికులు

ఐరాల : బ్యాంకుకొచ్చే మహిళా ఉద్యోగులను నిత్యం వేధిస్తున్న ఓ యువకుడిని స్థానికులు పట్టుకుని కరెంటు స్తంభానికి కట్టి దేహశుద్ధి చేసిన సంఘటన మంగళవారం మండలంలోని వైఎస్ గేటులో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. మండలంలోని కాణిపాకానికి చెందిన ఆకతాయి భూపాల్ వైఎస్ గేటులోని ఓ బ్యాంకు మహిళా ఉద్యోగులు చిత్తూరు నుంచి వైఎస్ గేటుకు ఆర్టీసీ బస్సులో వచ్చే సమయంలో నిత్యం వేధించేవాడు. ఈ నేపథ్యంలో మంగళవారం ఆకతాయి మహిళా ఉద్యోగులను వేధించడంపై ఆగ్రహించిన స్థానికులు ఆకతాయిని బంధించి అక్కడే కరెంట్ స్తంభానికి కట్టేసి దేహశుద్ధి చేశారు. దీనిపై ఆకతాయి తల్లిదండ్రులకు సమాచారం అందించారు.

సామాజిక మాధ్యమాలకు బానిస కావొద్దు



మాట్లాడుతున్న డీసీహెచ్ఎస్ ప్రభావతి

చిత్తూరు కలెక్టరేట్ : విద్యార్థులు సామాజిక మాధ్యమాలకు బానిసలు కాకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు వహించాలని డీసీహెచ్ఎస్ డాక్టర్. ప్రభావతి అన్నారు. మంగళవారం నగరంలోని నాగయ్య కళాక్షేత్రంలో సంసిద్ క్యాంఫోర్డ్ పాఠశాల వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు అతిథిగా పాల్గొన్న డీసీహెచ్ఎస్ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో చిన్నప్పటి నుంచి నైతిక విలువలను పెంపొందించాలన్నారు. ఉన్నత ఆశయంతో విద్యార్థులు ముందుకు సాగేలా టీచర్లు బోధన చేయాలన్నారు. ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచే బాలికలకు గుడ్‌టచ్..బ్యాడ్ టచ్‌పై అవగాహన పెంపొందించాలని తెలిపారు. అనంతరం ఆ పాఠశాల విద్యార్థులు చేసిన వ్యవసాయం, రైతుల గొప్పదనాన్ని తెలియజేసే విధంగా చేసిన నాటకాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మహేష్, పాఠశాల అధినేత శ్రీనివాసరావు, డైరెక్టర్ మాధవి, చైర్‌పర్సన్ కీర్తి, ప్రిన్సిపల్స్ కేశవులు, కవిత, అరుణ్, వినోద్ పాల్గొన్నారు.

ముగ్గురు ఎస్జీటీలను పంపాలని ఆదేశం

చిత్తూరు కలెక్టరేట్ : రాష్ట్ర విద్యాశాఖ కార్యాలయంలో విధులు నిర్వహించేందుకు జిల్లా నుంచి ముగ్గురు ఎస్జీటీలను పంపాలని ఆదేశించారు. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ అధికారులు జారీచేసిన ఉత్తర్వులు మంగళవారం డీఈఓ కార్యాలయానికి చేరాయి. రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ కార్యాలయంలో విద్యా సమీక్ష కేంద్రంలో విధులు నిర్వహించేందుకు ముగ్గురు ఎస్జీటీలను పంపాలన్నారు. కంప్యూటర్ స్కిల్స్, గణితంలో ప్రావీణ్యం ఉన్న వారిని పంపించాలంటూ డీఈఓను ఆదేశించారు.

- పలమనేరు మండలంలోని ఓ గ్రామంలోని బాలిక గర్భిణి అయింది. మూడు రోజుల కిందట మూర్ఛ వచ్చి చిత్తూరు జిల్లా ఆస్పత్రికి తీసుకొస్తే ఆరు నెలల గర్భిణిగా గుర్తించారు. ప్రమాదకర స్థితిలో ఉండడంతో వైద్యులు వెంటనే సిజేరియన్ చేసి బిడ్డను బయటకు తీశారు. ఆపై పరిస్థితి విషమించడంతో తిరుపతి రుయాకు రెఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ తల్లి మృతి చెందింది. ఆపై పోలీసులు పోక్సో నమోదు చేశారు. ఈ బాలిక గర్భిణి కావడానికి ముగ్గురు వ్యక్తులు, ఓ మహిళ కారణమని గుర్తించినట్లు తెలిసింది.
- చిత్తూరు నగరంలోని ఓ పాఠశాలలో పనిచేస్తున్న ఒక ఉపాధ్యాయుడు బాలికలపై అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడని,. ఆరు నెలలుగా బ్యాడ్ టచ్ చేస్తున్నాడని పలువురు ఉపాధ్యాయులు గుర్తించి కలెక్టర్, విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన కలెక్టర్ జిల్లా విద్యాశాఖ అధికారులను కీచక ఉపాధ్యాయుడిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయమని ఆదేశించారు. ఈ మేరకు స్పందించిన అధికారులు వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఉపాధ్యాయుడిపై ఈనెల 6వ తేదీన ఫిర్యాదు చేశారు. ఆపై అతడిని జిల్లా విద్యాశాఖ అధికారులు సస్పెండ్ చేశారు.
- ఇటీవల చిత్తూరులో ఓ ఆర్ఎంపీ 17 ఏళ్ల బాలికను నమ్మించి పనిలో పెట్టుకున్నాడు. నాలుగేళ్లుగా బాలికపై లైంగికదాడి చేస్తుండటంతో ఆమె మగ బిడ్డకు జన్మనిచ్చింది. అప్పుడుగానీ తల్లిదండ్రులకు విషయం తెలియలేదు. ఆర్ఎంపీని అరెస్టు చేసినా, జరగాల్సిన నష్టం జరిగిపోయింది.
- చెన్నైకు చెందిన ఓ మహిళ పొట్టకూటి కోసం దుబాయ్ వెళుతూ ఇటీవల తన ఆరేళ్ల కుమార్తెను చిత్తూరు నగరంలోని తన స్నేహితురాలి ఇంట్లో వదలి వెళ్లింది. చిన్నారిపై దాడి చేయడం, ఆమె భర్త లైంగిక దాడికి పాల్పడ్డట్లు గుర్తించిన బాధితురాలి తల్లి ఇటీవల పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేశారు.
- చిత్తూరు నగరంలోని ఓ కాలనీకి చెందిన వెంకటేష్ అనే వ్యక్తి ఓ మహిళతో సహజీవనం చేస్తున్నాడు. ఆమె తొమ్మిదేళ్ల కుమార్తెతో కలిసి ఒకే ఇంట్లో ఉంటున్నాడు. తాను పనికి వెళ్లి వచ్చేసరికి, బాలిక ఏడుస్తోందని.. అడిగితే తనపై వెంకటేష్ లైంగిక దాడికి ప్రయత్నించాడని బాలిక చెప్పిందని ఆమె తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాలికను వైద్య పరీక్షల కోసం ఆసుపత్రికి తరలించి, పిల్లలపై లైంగిక దాడుల నిరోధక చట్టం (పోక్సో) కింద కేసు నమోదు అయింది.

ఆపదలో ఆడబిడ్డ!



మాయమైపోతున్నాడమ్మా మనిషన్నవాడు.. మచ్చుకైనా లేడు చూడు మానవత్వం ఉన్నవాడు అన్న సినీ కవి మాటలు అక్షర సత్యమవుతున్నాయి. ఎక్కడో ఒక చోట నిత్యం మహిళలు, బాలికలపై అత్యాచారాలు, లైంగిక వేధింపులు చోటు చేసుకుంటున్నాయి. ఏ మాత్రం ఆదమరిచినా.. మానవ మృగాలు రెచ్చిపోయి కబళిస్తున్నాయి. తండ్రి స్థానంలో ఉండాల్సిన వ్యక్తులు.. విద్యా బుద్ధులు నేర్పించే గురువులు.. వయస్సుతో సంబంధం లేకుండా అకృత్యాలకు ఒడిగడుతున్నారు. ముక్కుపచ్చలారని బాలికలపై లైంగికదాడులకు తెగబడుతున్నారు. మూడు రోజుల కిందట పలమనేరులో జరిగిన బాలిక మృతి కలకలం రేపింది. ఇలాంటివి ఒకటి కాదు.. జిల్లాలో పదుల సంఖ్యలో కేసులు నమోదవుతుండడం ఆందోళన కలిగిస్తోంది.

- బాలికలపై పెరుగుతున్న లైంగిక దాడులు
- రెచ్చిపోతున్న మానవ మృగాలు
- చిట్టి తల్లులకు కడుపుకోత..
- అమాయక, పేదరిక బాలికలే లక్ష్యం
- చిన్నతనంలోనే అమ్మలవుతున్న వైనం
- కఠిన చర్యలు తీసుకోని అధికారులు

కాణిపాకం /చిత్తూరు అర్బన్: జిల్లాలో 15 అర్బన్ హెల్త్ సెంటర్లు, 50 పీహెచ్‌సీలున్నాయి. వీటి పరిధిలో గత 8 నెలల కాలంలో 27,378 మంది గర్భిణులు నమోదయ్యారు. ఇందులో 2,793 మంది టీనేజీ గర్భిణులను పీహెచ్‌సీ వైద్యాధికారులు గుర్తించారు. ఏమీ తెలియని వయస్సులో గర్భిణులు కావడం.. ఇవేమీ బయటకు తెలియకుండానే కేసులు సంఖ్య జిల్లాలో విపరీతంగా పెరుగుతున్నాయి. చాలా మంది తెలిసి అబార్షన్లు చేయించుకుంటున్నారు. తెలియక చాలా మంది నెలలు గడవడంతో ఏం చేయలేని పరిస్థితుల్లో తల దాచుకుంటున్నారు. ఇలాంటి కేసులు జిల్లాలో ప్రతి నెలా పదుల సంఖ్యలో బయట పడుతున్నాయి. కొంత మంది తల్లిదండ్రులు పరువు పోతుందని భావించి గుట్టు చప్పుడు కాకుండా ఉండిపోతున్నారు. కొంతమంది పోలీస్‌లకు ఫిర్యాదు చేస్తున్నారు. మరి కొంత మంది వివిధ కారణాలతో బయట పడుతున్నారు.

టీనేజీ తల్లుల నమోదు అధికం

కొన్ని పీహెచ్‌సీ పరిధిలో టీనేజీ గర్భిణుల సంఖ్య పెరుగుతోంది. 8 నెలల కాలంలో అధికారికంగా గుడిపల్లె పీహెచ్‌సీ పరిధిలో 111, ఒగులో 198, పెద్దపంజాణి 84, రామకుప్పం 70, కొలమాసనపల్లి 72, ముడిపాపనపల్లి 93, తుంబకుప్పం 105, పైపాళ్యం 88, పలమనేరు, బైరెడ్డిపల్లి, విజయపురం, పాతపేట, మల్లనూరు, రాళ్లబుదుగూరు, రాయల్‌పేట, గంగవరం, పచికాపలం, కార్వేటినగరం, తవణంపల్లి తదితర పీహెచ్‌ల పరిధిలో సంఖ్య 50 దాటుతోంది. ఆయా ప్రాంతాల్లో ఈ కేసులను తగ్గించేందుకు అధికారులు ఎలాంటి ప్రయత్నాలు చేయడం లేదు. ఈ కారణంగా మాతా, శిశు మరణాలు సంభవిస్తున్నాయి. వీటిపై ప్రతి నెలా సమీక్షలు చేస్తున్నారే తప్ప క్షేత్రస్థాయిలో ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శలు ఉన్నాయి.

చెడు వ్యసనాలు, పెద్దల భయం లేకపోవడం

ఉచిత అంతర్జాలం, సినిమాల ప్రభావం, చెడు వ్యసనాలు తదితర కారణాలతో కొందరు మగాళ్లు మృగాలుగా మారుతున్నారు. బాధ్యతలు తెలియకపోవడం, పెద్దల భయం లేకపోవడం, అధికంగా యువకులే ఇలాంటి వాటికి పాల్పడుతుండటం ఆందోళన కలిగిస్తోంది. చట్టలు ఏం చేస్తాయనే ధీమాతో లైంగిక దాడులకు ఒడిగడుతున్నారు. ఇక బాలికలకు సైతం సమాజంపై సరైనా అవగాహన లేక గుడ్డిగా నమ్మి మోసపోతున్నారు.

కుటుంబ సభ్యులు గుర్తించి .. చెప్పాల్సినవి..



- బాలికల అమాయకత్వం
- వెంటాడుతున్న పేదరికం, నిరాక్షరాస్యత
- తల్లిదండ్రుల పిల్లలకు శరీర భద్రత గురించి అవగాహన కల్పించాలి.
- చిన్న వయసు నుంచే సొంతంగా మల, మూత్ర విసర్జనకు వెళ్లడం నేర్పించాలి.
- శరీరంలో గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి చదువుకోలేని అమ్మాయిలకు చెప్పడం.
- సహజంగా తాకడానికి ఉద్దేశపూర్వకంగా తగలడానికి ఉండే వ్యత్యాసాన్ని వివరించి చెప్పాలి.
- ఎవరైనా అభ్యసంగా ప్రవర్తిస్తుంటే వెంటనే తల్లిదండ్రులు, బడిలో ఉపాధ్యాయులకు చెప్పమనాలి.
- తమతో ఎవరైనా ఇబ్బందికరంగా ప్రవర్తించినప్పుడు గట్టిగా అరవడం ద్వారా చుట్టుపక్కల వారి సాయం పొందాలని వివరించాలి.
- తల్లిదండ్రులకు తెలియకుండా ఎంత తెలిసిన వారివెంటైన వెళొద్దని చెప్పాలి.
- ఆత్మరక్షణ విద్య కచ్చితంగా నేర్పించాలి.

నేరాల నియంత్రణకు కఠిన చట్టాలు

లైంగిక దాడుల నేరాల నుంచి పిల్లలకు రక్షణ కల్పించే చట్టానికి 2012లో ఆమోదం లభించింది. ఆ ఏడాది జూన్ 19న ఈ చట్టానికి రాష్ట్రపతి ఆమోదం పొందింది. జూన్ 20న గెజిట్లో నోటిపై చేశారు. చట్టంలో పేర్కొన్న మేరకు బాలిక ఆమోదం తెలిపినా, తెలపకపోయినా 18 ఏళ్ల లోపు ఏ వ్యక్తి అయినా లైంగిక కలయిక జరిగితే అది లైంగిక దాడిగానే పరిగణించబడుతుంది. ఇప్పటి వరకూ ఇండియన్ పీనల్ కోడ్ సెక్షన్ 375 ప్రకారం 16 సంవత్సరాలలోపు వ్యక్తి ఆమోదం తెలిపినా, తెలపకపోయినా అది లైంగిక దాడిగా పరిగణించబడుతుంది. కానీ, ఇప్పుడు కొత్త చట్టం, నిబంధనల ప్రకారం అది 18 సంవత్సరాల వయసు గల ఏ వ్యక్తికైనా వర్తిస్తుంది.

టీనేజీ గర్భిణుల సమస్యలు ఇలా..



- మాతా శిశుమరణాలు సంభవిస్తాయి..
- నెలలు నిండకనే పుడుతారు
- బరువు తక్కువగా పుట్టడం
- ఎత్తుకు తగ్గ బరువు లేకపోవడం
- శారీరక లోపాలు
- కడుపు కోతలుంటాయి..మరిన్ని అనారోగ్య సమస్యలు తప్పవు.

మాయమాటలకు మోసపోతున్నారు..



పిల్లలను తల్లిదండ్రులు కంటికి రెప్పలా కాపాడినా కొంత మంది మానవ మృగాలుగా మారి కాసుకు కూర్చుంటున్నారు. సమాజంలో బాలికపై లైంగిక దాడులకు పాల్పడుతున్నారు. వీటిపై తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి. ప్రతి రోజు పిల్లల కోసం సమయం కేటాయించి..తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలి. మాయమాటలకు మోసపోకుండా చూడాలి. చాకెట్లు, బిర్యానీలు, ఇష్టమైన తినుబండారాలు ఇచ్చి మాయలోకి దింపుతారు. జాగ్రత్తగా ఉండాలి.

– మల్లికార్జున, తాలూకా ఎస్ఐ, చిత్తూరు

ఎవరినీ గుడ్డిగా నమ్మవద్దు



పిల్లల చుట్టూ ఉన్న అపరిచితులను గుడ్డిగా నమ్మరాదు. ఎదుటి వ్యక్తి వింత ప్రవర్తనను పసిగట్టాలి. పిల్లలు బాధపడుతున్న విషయాన్ని అర్థం చేసుకోవాలి. ప్రత్యేకించి దుర్మార్గమైన మనస్తత్వం ఉన్న వ్యక్తి స్నేహితుడో, కుటుంబ సభ్యుడో, జీవిత భాగస్వామినో అయితే పిల్లల భద్రత, వారి ఆనందం పూర్తిగా మీపై ఆధారపడి ఉంటుందని గుర్తుంచుకోవాలి. పిల్లలకు శరీరంలోని కొన్ని ప్రాంతాలు వారి సొంతమనే భావనను పెంపొందించాలి. భయపెడితే భయపెట్టిస్తారు.

– జయప్రియ, మానసిక వైద్యులు, చిత్తూరు

ప్రాణానికే ప్రమాదం



బాధ్యత తీరిపోతుందని చాలా మంది 18 ఏళ్లలోపే పెళ్లిళ్లు చేస్తున్నారు. మరికొంత మంది మాయగాళ్ల వలలో పడి చిన్నతనంలోనే పెళ్లి చేసేస్తున్నారు. మరి కొంత మంది ప్రస్తుత ప్రభావంతో దారి తప్పుతి గర్భిణులవుతున్నారు. ఇది చట్టరీత్యానేరం. అయినా ఈ విషయాన్ని మరిచిపోతున్నారు. చిన్నతనంలో తల్లులువుతున్నారు. శారీరక సమస్యలు తెచ్చుకుంటున్నారు. కొంత మంది ప్రాణం మీదకు తెచ్చుకుంటున్నారు.

– ప్రభావతి, డీసీహెచ్ఎస్, చిత్తూరు

వృత్తి విద్యకు ప్రోత్సాహకం



ప్రాజెక్టు నమూనాను చూపుతున్న విద్యార్థులు

రొంపిచెర్ల : వృత్తి విద్య కోర్సులు ప్రతి విద్యార్థికి అవసరమని మధ్యప్రదేశ్ రాష్ట్రం రాయపూర్ పీఎంశ్రీ కార్యాలయం పరిపాలనాధికారి అజిత్మిస్త్రా అన్నారు. పీఎంశ్రీ పథకం కింద ఎంపికైన రొంపిచెర్ల బాలుర ఉన్నత పాఠశాలను పరిశీలించేందుకు రెండు రోజుల కిందట వచ్చారు. మంగళవారం విద్యార్థులతో మాట్లాడుతూ.. వృత్తి విద్య ఎంతో అవసరమని, దీని కోసం కేంద్ర ప్రభుత్వం విద్యార్థులకు ఆర్థిక సాయం అందిస్తోందన్నారు. పదో తరగతి విద్యార్థుల వృత్తి విద్య దస్త్రాలను, ప్రాక్టికల్స్‌ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు వైవా అంశాలను పరిశీలించి మదింపు వేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మోహన్ రెడ్డి, వృత్తి విద్య ఉపాధ్యాయులు శశికుమార్, దినేష్ పాల్గొన్నారు.

సీనియారిటీ జాబితా పక్కాగా ఉండాలి : డీఈఓ

చిత్తూరు కలెక్టరేట్ : ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితా కసరత్తులో ఎలాంటి లోపాలకు తావివ్వొద్దని డీఈఓ వరలక్ష్మి అన్నారు. మంగళవారం డీఈవో కార్యాలయంలో సీనియారిటీ జాబితా కసరత్తు పై సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాను పకడ్బందీగా నియమ, నిబంధనల ప్రకారం సిద్ధం చేయాలన్నారు. టీచర్ల సీనియారిటీ జాబితాలో ఇప్పటికే పలు కేడర్ల ప్రాథమిక జాబితా సిద్ధం చేసినట్లు చెప్పారు. అయితే మరో మారు ఆ ప్రాథమిక జాబితాను పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు. సాంకేతిక సమస్యలున్నట్లెతై పరిష్కరించాలన్నారు. జాబితాలోని తప్పులను సరిచేయాలని ఆదేశించారు. ఎలాంటి తప్పులు లేని, పారదర్శకమైన సీనియారిటీ జాబితాను తయారు చేసేందుకు సిబ్బంది బాధ్యతతో పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో ఏడీలు వెంకటేశ్వర్లు, రంగస్వామి, సూపరింటెండెంట్‌లు వీజీ రమణ, సత్య పాల్గొన్నారు.

వైద్యసేవల్లో అలసత్వం వహిస్తే చర్యలు

- వైద్యశాఖ సమావేశంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ వెల్లడి



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యసేవలందించడంలో అలసత్వం వహిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ హెచ్చరించారు. మంగళవారం కలెక్టరేట్‌లో వైద్యఆరోగ్య శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఎన్టీఆర్ వైద్యసేవ అమల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవన్నారు. జిల్లాలోని ఏరియా ఆసుపత్రులు, సీహెచ్‌సీలు, నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్ట్ ఆధ్వర్యంలో రోగులకు పకడ్బందీగా వైద్యసేవలందించాలన్నారు. రోగులకు వైద్యసేవలందించే విషయంలో ఆరోగ్యమిత్రలు కచ్చితంగా నియమ, నిబంధనలు పాటించాలని తెలిపారు. ఎక్కడైనా అలసత్వం వహిస్తున్నట్లు తనకు ఫిర్యాదులు అందితే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో వైద్యసేవలు పొందే రోగుల నుంచి నగదు రహిత వైద్యం అందించేలా ఆరోగ్యమిత్రలు చర్యలు చేపట్టాలన్నారు. రోగుల వైద్య సేవల సమాచారం ఎప్పటికప్పుడు యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఆరోగ్య మిత్రలు సమయపాలన పాటించి, విధులను బాధ్యతతో నిర్వర్తించాలని ఆదేశించారు. సమావేశంలో ఎన్టీఆర్ వైద్యసేవ జిల్లా కో ఆర్డినేటర్ డా.సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

మావిడాకులు



భార్య, భర్తలకు కౌన్సెలింగ్ ఇస్తున్న గృహహింస విభాగం కౌన్సెలర్ సుగుణ, పీవీ రేఖ

పెళ్లంటే.. రెండు కుటుంబాలు , రెండు జీవితాలు ఒక్కటి కావడం.. మూడు ముళ్లు..ఏడడుగులు కలిసి.. కష్టం వచ్చినా..కన్నీళ్లొచ్చినా నిండు నూరేళ్ల దంపతులు చేయి విడవకుండా ఒకరిపై మరొకరు ప్రేమ, ఆప్యాయతలు , అనురాగంతో ఆనందంగా జీవితం గడపడం .. ఇది హిందూ సంప్రదాయంలోని గొప్పతనం. కానీ చిన్నవాటికే తగువులాడుకోవడం, పట్టింపులు, పంతాలకు పోయి అందమైన జీవితాలను అంధకారం చేసుకుంటూ ఇరు కుటుంబాలకు మనోవేదన మిగులుస్తున్నారు. నేటితరం కొత్త పోకడలతో జీవితాలను బుగ్గిపాలు చేసుకుంటున్నారు. ఈ కోవలోనే ఇటీవల జిల్లాలో దంపతుల విడాకుల సంఖ్య అనూహ్యంగా పెరుగుతోంది. దీనిపై సర్వత్రా ఆందోళన వ్యక్తం అవుతోంది.

- పెళ్లి అయిన కొన్నిరోజులకే విడిపోతున్న జంటలు
- మూడు ముళ్ల బంధం.. మూణ్నాళ్ల ముచ్చటే..!
- కూలుతున్న పచ్చని కాపురాలు
- బలహీన పడుతున్న వివాహ బంధం
- గృహహింస విభాగాన్ని ఆశ్రయించిన 207 బాధితులు
- రాజీ పడుతున్న జంటలు కొన్నే.

కార్వేటినగరం : జీవితాంతం కలసిమెలసి జీవిస్తామని అగ్ని సాక్షిగా ఒక్కటైన దంపతులు..పెళ్లి ముచ్చట తీరకముందే గొడవలు పడుతున్నారు. ప్రేమ, ఆప్యాయతలతో ఆనందంగా ఉండాల్సిన వారు అపోహలు, అనుమానాలతో విడిపోతున్నారు. నీవే నాప్రాణం..నీవు లేకపోతే చచ్చిపోతానంటూ పెళ్లి అయిన తొలినాళ్లలో ఎంతో ప్రేమ చూపేవారు.. ఆ తర్వాత వాటన్నింటిని మరిచి.. ఒకరిపై ఒకరు చాడీలు చెప్పుకోవడం, ఛీదరించుకోవడం, కోపడ్డం.. చివరకు విడాకులు వరకు వెళుతున్నాయి.

భవిష్యత్తు అంధకారం..

చిన్న చిన్న విభేదాలు, వివాదాలతో కోర్టు మెట్లు ఎక్కుతుంటే.. మరి కొందరు క్షల కార్పణ్యాలతో రగిలిపోతున్నారు. గృహహింస విభాగం సిబ్బంది, పోలీసుల కౌన్సెలింగ్‌తో కొందరు సర్దుకుపోతున్నారు. మరి కొందరు అయితే మూర్ఖంగా వ్యవహరించి భవిష్యత్తును అంధకారం చేసుకోవడంతో పాటు వారి పిల్లలకు తల్లిదండ్రుల ప్రేమ, ఆప్యాయతలను దూరం చేస్తున్నారు. తరచూ ఇటువంటి ఘటనలు చోటు చేసుకోవడంతో పెళ్లి అంటేనే ఆడ, మగపిల్లల తల్లిదండ్రులు ఆలోచనలో పడుతున్నారు.

కౌన్సెలింగ్ ఇచ్చినా..

వివిధ కారణాలతో విడిపోయేందుకు సిద్ధపడుతున్న దంపతులను కలపడానికి ఎన్ని కౌన్సెలింగ్‌లు ఇచ్చినా ఫలితం లేకుండా పోతోంది. ఉమ్మడి కుటుంబాలు విచ్చిన్నమై చిన్నకుటుంబాలు ఏర్పడడం వల్ల సంప్రదాయాలు, సత్సంబంధాలు గురించి తెలియడం లేదు. ఒకరి నిర్ణయాలకు మరొకరు గౌరవించకపోవడం, మొండి వైఖరితో భవిష్యత్తును అంధకారం చేసుకుంటున్నారని పోలీసులు, గృహ హింస కౌన్సెలింగ్ విభాగం సిబ్బంది చెబుతున్నారు.

ఎవరికి వారే మొండిపట్టు..

సంప్రదాయాలను గౌరవిస్తూ గతంలో ఒకరి అభిప్రాయాలను మరొకరు గౌరవిస్తూ పిల్లలకు ఆదర్శవంతమైన తల్లిదండ్రులుగా నిలిచేవారు. ఏమైనా సమస్యలు వస్తే ఉమ్మడి కుటుంబాలు కావడంతో ఇద్దరికీ సర్దిచెప్పి వారి మధ్య మనస్పర్థలను తొలగించేవారు.అప్పటికీమాట వినకపోతే ప్రత్యేకంగా కౌన్సెలింగ్ ఇచ్చి దంపతులను ఒక్కటి చేసేవారు. ప్రస్తుత పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంది. పెద్దల మాటలను గౌరవించని , సమాజ విలువలు పాటించని, వివాహ బంధాలను లెక్కచేయని యువతీ, యువకులు వివాదాల్లో చిక్కుకుని, కుటుంబ సభ్యులను మనోవేదనకు గురిచేస్తున్నారు.

వేరు కాపురాలపై ఆసక్తి..

ఉమ్మడి కుటుంబంలో కలసి జీవించేందుకు అధిక శాతం మంది యువతులు సుముఖత చూపడం లేదు. అదేమని అడిగితే అత్త, మామలు, ఆడపడుచుల దెప్పి పొడుపులు ఉంటాయని చెబుతున్నారు. తల్లిదండ్రులు కూడా తమ కుమార్తెకు ఎలాంటి సమస్యలు లేకుండా ఉండాలని ఆలోచిస్తున్నారు. ఉమ్మడి కుటుంబంలో తమ కుమార్తె హాయిగా జీవించగలదనే భరోసా కల్పించలేకపోతున్నారు. కారణం ఏదైనా చిన్న కుటుంబంగా జీవించడం అలవాటు పడుతున్న నేటి పరిస్థితుల్లో ఉమ్మడి కుటుంబాలకు ససేమిరా అంటున్నారు. ఇది కూడా పండంటి కాపురాలకు అవరోధంగా మారింది.

వివిధ కారణాలతో కోర్టుకు...



పెళ్లయిన కొద్ది రోజులకే భర్త పట్టించుకోకపోవడం లేదని, అత్తమామలు, ఆడపడుచులు వేధిస్తున్నారని మహిళలు గృహహింస విభాగాన్ని ఆశ్రయిస్తున్నారు. మరికొంత మంది పోలీస్ స్టేషన్‌లో కేసులు పెడుతున్నారు. మరికొందరు నేరుగా కోర్టులో కేసు పెడుతున్నారు. గత ఏడాది ఏప్రిల్‌లో 207 మంది గృహహింస విభాగాన్ని ఆశ్రయించారు. వీరిలో 145 మంది గృహహింస విభాగం సిబ్బంది ఇచ్చిన కౌన్సెలింగ్‌లో రాజీ పడ్డారు. 45 కేసులు కోర్టుకు ఫైల్ చేశారు. అందులో ఒక్కటి కోర్టు ఆర్డర్ అయింది.17 కేసులు కౌన్సెలింగ్ ప్రాసెస్‌లో ఉన్నాయి.

– సుగుణ, గృహహింస విభాగం సోషల్ అండ్ లీగల్ కౌన్సెలర్, చిత్తూరు

గొప్పలకు పోయి నాశనం చేసుకుంటున్నారు



ప్రస్తుత పరిస్థితుల్లో ఎక్కువ మంది దంపతులు ఉన్నత చదువులు చదువుకున్న వారే. ఆర్భాటాలు, గొప్పలకుపోయి జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. కుటుంబ జీవితంపై అవగాహన ఉండాలి. ఉన్నంతలో సర్దుకుపోవడానికి ప్రయత్నించాలి. పిల్లలను ఆదర్శంగా తీర్చిదిద్దాలి. కుటుంబ వ్యవస్థకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యం ఇవ్వాలి. వివిధ కారణాలతో గృహహింస విభాగాన్ని ఆశ్రయించే వారికి చెబుతున్నాం. సాధ్యమైనంత వరకు కలిపేందుకు ప్రయత్నిస్తున్నాం. అప్పటికీ రాజీ పడని వారికి కోర్టులో కేసు ఫైల్ చేస్తాం.

– డి.వెంకటేశ్వరి, గృహహింస విభాగం ప్రాజెక్టు డైరెక్టర్, చిత్తూరు

క్లుప్తంగా

దోబీ ఘాట్ ఆక్రమణలు తగవు



ట్రెంచ్ ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ అధికారులు

నదుం : మండల కేంద్రంలో దోబీ ఘాట్‌కు కేటాయించిన స్థలంలో ఆక్రమణలు తగవని బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీదేవి తెలిపారు. మండల కేంద్రంలోని కుమారొడ్డుని చెరువు వద్ద 76/1 సర్వే నంబరులో గతంలో రెవెన్యూ అధికారులు దోబీ ఘాట్ కోసం 53 సెంట్ల స్థలం మంజూరు చేశారు. అందులో కమ్యూనిటీ భవనం నిర్మాణం పూర్తి కాగా, దోబీఘాట్ పనులు జరుగుతున్నాయి. కాగా కొందరు రియల్టర్లు ఈ స్థలంలో కొంత భాగాన్ని ఆక్రమించి.. తమ ప్లాట్ల కోసం రోడ్డును ఏర్పాటు చేసుకున్నారని పలువురు రజకులు కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాల మేరకు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ విజయలక్ష్మి, తహశీల్దారు హుస్సేన్‌తో కలిసి కార్పొరేషన్ ఈడీ ఆక్రమిత ప్రదేశాన్ని పరిశీలించారు. అధికారుల సాయంతో దోబీ ఘాట్‌కు కేటాయించిన భూమికి హద్దులు నిర్ణయించి, జేసీబీతో ట్రెంచ్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రజక సంఘం ఏపీ అధ్యక్షుడు షణ్ముగం, సర్వే సిబ్బంది, నాయకులు బాబురెడ్డి, గోపాల్, నవీన్, గణేష్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై మూకుమ్మడి దాడి



చికిత్స పొందుతున్న భాను

పలమనేరు : మండలంలోని గొల్లపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త భాను(42)పై సోమవారం రాత్రి కొలమాసనపల్లికి చెందిన వాసు తదితరులు పది మంది దాకా మూకుమ్మడిగా దాడిచేసి గాయపరిచినట్లు బాధితుడు మంగళవారం తెలిపారు. తాను ఇంటి వద్ద ఉండగా కొందరు గుర్తు తెలియని వ్యక్తులు గుంపుగా వచ్చి చితకబాదారని ఆపై గ్రామస్తులు అడ్డుకోవడంతో పరారైనట్లు బాధితుడు తెలిపారు. ప్రస్తుతం పలమనేరులోని ప్రభుత్వాసుపత్రిలో భాను చికిత్స పొందుతున్నాడు. జరిగిన సంఘటనపై పోలీసులు విచారణ చేస్తున్నారు.

స్త్రీ,శిశు సంక్షేమమే ధ్యేయం

వి.కోట : స్త్రీ,శిశు సంక్షేమమే ధ్యేయంగా అంగన్‌వాడీ కార్యకర్తలు పనిచేస్తూ , నిత్యం వారికి అందుబాటులో ఉండాలని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక బాలికోన్నత పాఠశాలలో మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో జ్ఞానజ్యోతి కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జె డ్పీ చైర్మన్ హాజరయ్యారు. బాలింతలు, గర్భిణులు ,శిశువులకు పౌష్టికాహారం అందించి వారి మెరుగైన ఆరోగ్యానికి కృషి చేయాలన్నారు. ఎంఈఓ-2 మురుగేష్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అరుణశ్రీ, ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు మురళీ, రాఘవేంద్ర, రియాజ్ పాల్గొన్నారు.

మృగాళ్ల మాయమాటలకు చిన్నారి బలి

- తెలిసీ తెలియని వయసులో మోసపోయిన బాలిక
- ఇందుకు సహకరించిన ఇద్దరు మహిళలు
- ఆధారాల సేకరించిన వైనం
- పోలీసుల అదుపులో నిందితులు

పలమనేరు : తెలిసీ తెలియని వయసులో మృగాళ్ల దాహానికి పదో తరగతి చదువుతున్న బాలిక సోమవారం తనువు చాలించిన విషాదకర ఘటన తెలిసిందే. పేదరికం కారణంగా ఆ బాలిక తల్లిదండ్రులు పొద్దున కూలిపనులకెళితే ఎప్పుడో రాత్రికి గాని ఇంటికి రారు. దీంతో పిల్లలను చూసుకోవాల్సిన సమయం దొరకలేదు. స్కూల్ వదిలాక, సెలవు రోజుల్లో ఇంట్లో ఒంటరిగా ఉంటున్న మైనర్ బాలిక అదే గ్రామానికి చెందిన ఇరువురు మహిళలతో కాస్త చనువుగా ఉండడమే ఈ ఘాతుకానికి కారణమైందనే సమాచారం ఇప్పుడు పలమనేరు మండలం అంతా చర్చ సాగుతోంది.

ఇద్దరు మాయలేడిల మత్తులో..

పలమనేరు మండలంలోని బాలిక గ్రామానికే చెందిన ఇద్దరు మహిళలు పశువులు మేపుకొనే వారు తరచూ మైనర్ బాలిక ఇంటికి వచ్చి చనువుగా ఉంటున్నట్లు తెలిసింది. దీంతో వారు ఆ కుటుంబంలోని పదో తరగతి చదువుతున్న బాలిక, ఏడో తరగతి చదివే ఆమె తమ్ముడు, గ్రామంలో రెండో క్లాస్ చదివే మరో చెల్లితో స్నేహంగా ఉన్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో ఈ ఇరువురు యువతులకు అదే గ్రామానికి చెందిన తాపీ పనులు చేసే మంజు, నవీన్, మల్లికార్జున బాగా పరిచయస్తులు. ఈ యువతుల ద్వారా మైనర్ బాలికపై వీరు కన్నేసినట్లు తెలుస్తోంది. అభం శుభం ఎరుగని మైనర్ బాలికలు గత ఏడాదిగా వీరికి బిరియాని, తినుబండారాలు ఇస్తూ లోబరుచుకున్నట్లు బాధితురాలి సోదరి తెలిపింది. ఏదేమైనా ఇరువురు కిలాడీ లేడీల సాయంతోనే మృగాళ్లు మైనర్ బాలికను వశం చేసుకున్నట్లు గ్రామంలో అందరి నోటా వినిపిస్తోంది.

గతంలో కేసులు నీరుగార్చినందుకే..అనుమానాలు

గతంలోనూ మైనర్ బాలికలను గర్భిణులను చేసిన రెండు సంఘటనలు ఈ గ్రామంలో చోటు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో ఈ కేసులో మృతి చెందిన బాలిక కుటుంబానికి న్యాయం జరగలేదనే మాట ఇప్పుడు సంచలనమైంది. ఈ కేసుల్లోని నిందితులు రాజీ మార్గాలు, రాజకీయ నేతల ద్వారా దర్జాగా తప్పించుకున్నట్లు తెలిసింది. దీంతో ఎవరిని అత్యాచారం చేసినా ఎలాగైనా తప్పించుకోవచ్చుననే భావన యువకుల్లో నెలకొంది. ఈ కారణంగానే ఇప్పుడు పదో తరగతి బాలిక మృతికి కారణమైందనే మాట గ్రామంలో అందరినోట వినిపిస్తోంది. ఇలాంటి కేసుల్లో అసలు నిందితులను వదిలి పెట్టడంతోనే ఇలాంటి దురాఘతాలకు పదే పదే జరుగుతున్నా యని గ్రామస్తులు ఆరోపిస్తుండడం విశేషం.



అదుపులో నిందితులు...

మైనర్ బాలికను గర్భం చేసి ఆమె మృతికి కారణమైన ఈ కేసులో ఇప్పటికే పోలీసులు పలువురు యువకులు, ఇరువురు మహిళలను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలుస్తోంది. రేపోమాపో ఈ కేసుకు సంబంధించి అసలు నిందితులను పోలీసులు పట్టుకోవడం ఖాయంగా కనిపిస్తోంది. ఎస్పీ మణికంట చందోలు ఆదేశాల మేరకు స్థానిక డీఎస్పీ డేగల ప్రభాకర్, సీఐ నరసింహరాజు ఈ కేసులో నిందితులను కోర్టు ముందు ఉంచేందుకు సిద్ధం అవుతున్నారు.

అయ్యో బిడ్డా.. ఎంత ఘోరం

- బాలిక అంత్యక్రియలు
- సాయం చేసిన దాతలు
- ఇలాంటి ఘటనలు పునరావృతం కారాదన్న మాజీ ఎమ్మెల్యే



వెంకటేగౌడ, పలమనేరు మాజీ ఎమ్మెల్యే

పలమనేరు : కామాంధుడి దాహానికి బలై తొమ్మిది నెలలు కడుపులో బిడ్డను మోసి తనువు చాలించిన బాలిక అంత్యక్రియలు మండలంలోని ఓ గ్రామంలో మంగళవారం అశ్రునయనాల మధ్య నిర్వహించారు. గ్రామస్థులు, బంధువుల రోదనల మధ్య ఆఖరి తంతు పూర్తి చేశారు. ఇలాంటి ఘోరం ఇంకే ఆడపిల్లకు జరగరాదంటూ కుటుంబికులు ఆక్రోశం వెల్లగక్కారు. పేద కుటుంబం కావడంతో గ్రామానికి చెందిన మునస్వామి, వైఎస్సార్‌సీపీ నేతలు బాలాజీనాయుడుతో కలసి అంత్యక్రియల కోసం రూ.5 వేల ఆర్థికసాయం అందజేశారు. బాలిక చదువుతున్న పాఠశాల తోటి పిల్లలు, ఉపాధ్యాయ బృందం కొంత సాయాన్ని అందించారు. దీంతో బాలిక అంత్యక్రియలు జరిగాయి. పలువురు వైఎస్సార్‌సీపీ నేతలు బాలిక మృతదేహానికి నివాళి అర్పించి కుటుంబానికి ధైర్యం చెప్పారు.

ఇలాంటివి పునరావృతం కారాదు...

ఈ సంఘటనపై స్పందించిన పలమనేరు మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ తన ప్రగాఢసానుభూతిని తెలిపారు. రాష్ట్రంలో ఇటీవల రోజూ ఏదో ఓచోట ఆడబిడ్డలపై అఘాయిత్యాలు జరుగుతూనే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఘటనలు జరిగినప్పుడు పోలీసులు పోక్సో కేసులను నమోదు చేసి ఆపై చేతులు దులుపుకోవడం షరా మామూలైందని తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని తెలిపారు. ఇలాంటి సంఘటనల కోసమే గత ప్రభుత్వంలో దిశా చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేశారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇలాంటి ఘటనలు నిత్యకృత్యమైయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. బాలిక కుటుంబాన్ని కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మరో వైపు స్వచ్ఛంద సంస్థలు, ఐద్వా, కమ్యూనిస్ట్ నేతలు, ప్రజా, మహిళా సంఘాలు నిందితులను కఠినంగా శిక్షించాలంటూ డిమాండ్ చేస్తున్నారు.

విషాదఛాయలు

మైనర్ బాలిక మృతి, ఆస్పత్రిలో శిశువు ఆరోగ్య పరిస్థితి బాగా లేకపోవడంపై గ్రామంలో ఏ ఇంట్లో చూసినా విషాదం అలుముకుంది. కూలీనాలికెళ్లే తమలాంటి కుటుంబాల్లో బడి కెళ్లే ఆడ పిల్లలను ఎల్లవేలలా చూసుకొనే పరిస్థితి ఉండదని వాపోతున్నారు. ఏదేమైనా గ్రామంలో ఏ నోట విన్నా అయ్యో బిడ్డా ఇలా అయిందనే మాట వినిపిస్తోంది.

మహిళా వర్సిటీ వీసీగా ప్రొఫెసర్ ఉమ



వీసీ ప్రొఫెసర్ వి ఉమ

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీ వీసీగా ప్రొఫెసర్ ఉమను నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆమె 40 ఏళ్ల పాటు బోధన, పరిశోధన రంగాల్లో పనిచేశారు. జాతీయ, అంతర్జాతీయ పబ్లికేషన్‌తో పాటు స్టేట్ బెస్ట్ టీచర్‌గా ప్రశంసలు పొందారు. మహిళా వర్సిటీకి రెక్టార్‌గా, ఇన్‌చార్జి వీసీగా పనిచేసిన ఆమెకు వర్సిటీ పాలనపై అవగాహన ఉంది. ప్రస్తుతం ఇన్‌చార్జ్‌గా వీసీగా కొనసాగుతున్న ఆమె బుధవారం పూర్తి స్థాయి బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా సాధకారితే లక్ష్యంగా వర్సిటీని మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తానని చెప్పారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: శ్రీవారి సర్వదర్శనం సుమారు 12 గంటల సమయం పట్టే అవకాశం ఉంది. మంగళవారం సాయంత్రానికి 20 కంపార్ట్‌మెంట్లలో భక్తులు వేచి ఉన్నారు. సోమవారం అర్ధరాత్రి వరకు 60, 784 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.29కోట్లుగా అధికారులు తెలిపారు.

పండ్ల పరిశ్రమలో ఆధునిక సాంకేతికత



సదస్సును ఉద్దేశించి మాట్లాడుతున్న సమాఖ్య ప్రధాన కార్యదర్శి గోవర్ధన్ బాబి

- స్వీడన్ ప్రతినిధులతో అవగాహన సదస్సు

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : జిల్లాలోని రైతులు అత్యధికంగా మామిడి సాగు చేస్తున్నారని, ఫలితంగా పండ్ల గుజ్జు పరిశ్రమలు ఎప్పటికప్పుడు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడం ద్వారా ఖర్చులు తగ్గించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని దక్షిణ భారత ఆహార శుద్ధి పరిశ్రమల దారుల సమాఖ్య ప్రధాన కార్యదర్శి గోవర్ధన్ బాబి అన్నారు. చిత్తూరు నగరంలోని మ్యాంగో భవన్‌లో మంగళవారం పరిశ్రమల ప్రతినిధులు, ఆల్ఫా లావల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, పూనే, స్వీడన్ దేశ ప్రతినిధులతో యాంత్రీకరణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. మామిడి గుజ్జు పరిశ్రమ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వైపు అడుగులు వేస్తూ వస్తోందన్నారు. ప్రస్తుతం చాలా పరిశ్రమలు ఆధునిక సాంకేతికతను ఉపయోగించి అసెప్టిక్ ప్రాసెసింగ్ ప్లాంట్లు ఏర్పాటు చేశాయన్నారు. ఏటా జిల్లాలో సుమారు 8 లక్షల టన్నుల మామిడి పల్ప్ ఉత్పత్తి అవుతోందన్నారు. వీటి తయారీలో ఎప్పటికప్పుడు టెక్నాలజీని పెంచుకుంటూ ఖర్చు తగ్గించే ప్రయత్నం చేయాలన్నారు. ఇందులో భాగంగానే ఆల్ఫా లావల్ ఇండియా, స్వీడన్ దేశ ప్రతినిధులు జిల్లాకు వచ్చారన్నారు. ఉత్పత్తిదారులకు ఉన్న సమస్యలను పరిష్కరించుకోవడంతో పాటు ఆల్ఫా లెవల్ వారు నాణ్యమైన సేవలను అందించేలా చూడాలని వివరించారు. ఆల్ఫా లావల్ స్వీడన్ దేశ ప్రతినిధి పీటర్ నెల్సన్ మాట్లాడుతూ.. తమ సంస్థ ద్వారా జిల్లాలోని మామిడి పరిశ్రమలకు సాంకేతిక పరిజ్ఞానంతో పాటు పలు యంత్రాలను సరఫరా చేస్తోందన్నారు. అనంతరం పలు సమస్యలను ఫ్యాక్టరీ నిర్వాహకులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో జిల్లా పండ్ల పరిశ్రమల సమాఖ్య అధ్యక్షుడు శివకుమార్, ల్వా లవర్ కంపెనీ స్వీడన్ దేశ ప్రతినిధులు, మార్కస్ హాఫ్మాన్, దేశ ప్రతినిధులు శుభాశీస్సు దాస్, ధర్మేశ్, హితేందర్ కుమార్, అతుల్ జోషి, భాస్కర్ ఆనంద్ పాల్గొన్నారు.

ఆ పిల్లలను తల్లిదండ్రులు అపురూపంగా చూసుకున్నారు.. తమ కంటిపాపలైన పిల్లలను ఉన్నతంగా చదివించాలని ఆరాటపడ్డారు. ఈ క్రమంలో రోడ్డు ప్రమాదం ఆ ఇంటి ఆశా దీపాలను ఆర్పేసింది. ఈ విషాదకర ఘటన బంగారుపాళెం మండలంలో చోటుచేసుకుంది. – బంగారుపాళెం

ఆరిన ఆశా దీపాలు

- ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న కారు
- ఇద్దరు విద్యార్థులు దుర్మరణం





ప్రమాదానికి కారణమైన కారు, సంఘటన స్థలంలో రోదిస్తున్న గణేష్ కుటుంబ సభ్యులు


మండలంలోని చెన్నై–బెంగళూరు జాతీయ రహదారి ఆర్‌ఆర్ నగర్ వద్ద మంగళవారం రాత్రి ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు విద్యార్థులు మృతి చెందినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. కరిడివారిపల్లెకు చెందిన హేమశేఖర్ కుమారుడు గౌతం(21) చిత్తూరు పట్టణంలో ఓ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్నాడు. తగ్గువారిపల్లె పంచాయతీ పరిధిలోని సాయినగర్‌కు చెందిన బాబు కుమారుడు గణేష్(14) బంగారుపాళెంలో ఓ ప్రైవేట్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. వీరు ద్విచక్రవాహనంపై మొగిలి వెంకటగిరి నుంచి బంగారుపాళెం వైపు వస్తుండగా చిత్తూరు నుంచి పలమనేరు పోతున్న కారు ఢీ కొంది. ఈ ప్రమాదంలో గణేష్ సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. గౌతం తీవ్రంగా గాయపడడంతో చికిత్స నిమిత్తం బంగారుపాళెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. రోడ్డు ప్రమాదంలో తమ పిల్లలు మృతి చెందారన్న విషయాన్ని తెలుసుకున్న తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఆసుపత్రి వద్దకు చేరుకున్నారు. విగత జీవులుగా పడి ఉన్న బిడ్డలను చూసి బోరున విలపించారు. మృతదేహాలను పోస్టుమార్టానికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



సంఘటన స్థలంలో మృతి చెందిన గణేష్



ఆసుపత్రిలో మృతి చెందిన గౌతం



కేసుల విచారణ వేగవంతం చేయాలి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావు

చిత్తూరు అర్బన్ : జిల్లాలోని పలు కేసుల పరిష్కారానికి న్యాయవాదులు కృషి చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావు పేర్కొన్నారు. కొత్తగా చిత్తూరులో ఆరో అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి శ్రీనివాసరావు, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి భారతి, మొబైల్ కోర్టు న్యాయమూర్తి పి.వెన్నెల బాధ్యతలు స్వీకరించారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వీరికి స్వాగతం పలుకుతూ మంగళవారం సాయంత్రం స్థానిక బార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ.. బార్, బెంచ్ మధ్య స్నేహపూర్వక వాతావరణం ఉండాలన్నారు. కేసుల విచారణ వేగవంతం చేసి సత్వరం తీర్పులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి రమేష్, జిల్లా పోక్సో కోర్టు న్యాయమూర్తి శాంతి, న్యాయమూర్తులు శ్రీనివాసరావు, ఉమాదేవి, పద్మజ, మాధవి, శ్రీనివాస్, షేక్బాబాజాన్, బార అసోసియేషన్ అధ్యక్షుడు శంకరనాయుడు, కార్యదర్శి సురేష్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు భూప్రసన్న, న్యాయవాదులు పాల్గొన్నారు.

స్కూల్ స్వీపర్స్ సంఘం ఏకగ్రీవం



ఆశ, జిల్లా అధ్యక్షురాలు



జయకుమారి, జిల్లా ప్రధాన కార్యదర్శి

చిత్తూరు కార్పొరేషన్ : జిల్లా స్కూల్ స్వీపర్స్ సంఘం కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షుడు నాగరాజన్, జిల్లా కార్యదర్శి కోదండయ్య మంగళవారం ప్రకటించారు. మొత్తం 23 మందితో జిల్లా సమితి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లా గౌరవ అధ్యక్షుడిగా కోదండయ్య, జిల్లా అధ్యక్షురాలుగా ఆశ (గుడిపాల), జిల్లా ప్రధాన కార్యదర్శిగా జయకుమారి (కార్వేటినగరం), జిల్లా ఉపాధ్యక్షులుగా లక్ష్మి (నగరి), తులసి (పాలసముద్రం), వనిత (బంగారుపాలెం), భువన (వెదురుకుప్పం), జిల్లా సహాయ కార్యదర్శులుగా ఇందిరా (ఎస్ఆర్‌పురం), మమతా (కార్వేటినగరం), కోకిల (జీడీనెల్లూరు), జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మంజుల (ఎస్ఆర్‌పురం), జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగా సంధ్య(చిత్తూరు), జిల్లా కోశాధికారిగా రాధ (పెనుమూరు), వీరితో పాటు ఈసీ మెంబర్లుగా రోజా, మమత, దేశమ్మ, కాజముని, రమాదేవిని ఎన్నుకోవడం జరిగిందన్నారు. వీరు మూడు సంవత్సరాల పాటు పదవిలో ఉంటారన్నారు.

సైన్స్‌పై మక్కువ పెరగాలి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలోని అపోలో యూనివర్శిటీలో ఈనెల 28న జాతీయ విజ్ఞాన దినోత్సవం నిర్వహించనున్నారని కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ తెలిపారు. ఈ మేరకు జాతీయ విజ్ఞాన దినోత్సవ పోస్టర్‌లను మంగళవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువతకు సైన్స్‌పై మక్కువ పెంచేలా చర్యలు చేపట్టాలన్నారు. జాతీయ విజ్ఞాన దినోత్సవాలు నిర్వహించడంతో విద్యార్థుల్లో సామర్థ్యాలు పెంపొందుతాయన్నారు. యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ ప్రొ.వినోద్‌భట్ మాట్లాడుతూ.. యూనివర్శిటీలో నిర్వహించే కార్యక్రమంలో స్థానిక పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు సైన్స్ ప్రాజెక్టులను రూపొందించి ప్రదర్శించవచ్చన్నారు. వివిధ రంగాల్లో మొత్తం 27 బహుమతులను అందిస్తున్నట్లు చెప్పారు. స్థానిక విద్యార్థులు తమ ఆలోచనలను ప్రాజెక్టుల రూపంలో ప్రదర్శించాలన్నారు. యువ శాస్త్రవేత్తలను ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సైన్స్, టెక్నాలజీ రంగాల్లో విద్యార్థులకు ప్రాథమికంగా పరిశోధన అభివృద్ధికి ఇలాంటి వేడుకలు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. ప్రాజెక్టులు ప్రదర్శించేందుకు ఆసక్తి ఉన్న విద్యాసంస్థలు 99595 40302, 98850 85025, 83330 74158 నంబర్లల్లో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో పలువురు అపోలో యూనివర్శిటీ సిబ్బంది పాల్గొన్నారు.



డీఐజీకి చిత్రపటం అందజేస్తున్న ఈఓ

కాణిపాకంలో ఇంటలిజెన్స్ డీఐజీ

కాణిపాకం : శ్రీ వరసిద్ధి వినాయక స్వామిని మంగళవారం ఇంటలిజెన్స్ డీఐజీ ప్రకాష్ దర్శించుకున్నారు. కుటుంబ సమేతంగా వచ్చిన ఆయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. వేద ఆశీర్వచన మండపంలో పండితులు ఆశీర్వచనాలు చేసి తీర్థప్రసాదాలు ,చిత్రపటాన్ని అందజేశారు. ఈఓ పెంచల కిషోర్, ఏఈఓ ప్రసాద్, సూపరింటెండెంట్ వాసు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ బాలాజీ నాయుడు, కాణిపాక ఎస్ఐ ధరణిధర ఉన్నారు.

డీసీఈబీకి పరీక్ష!

కీలకమైన జిల్లా ఉమ్మడి పరీక్షల విభాగంశాఖ 18 రోజులుగా మూతపడింది. ఆ శాఖ సెక్రటరీ గత నెలలో ఉద్యోగ విరమణ చెందారు. అయితే అప్పటి నుంచి నూతన సెక్రటరీని నియమించడంలో జిల్లా విద్యాశాఖ మీనమేషాలు లెక్కిస్తోంది. పరీక్షల నిర్వహణలో కీలకమైన ఈ శాఖకు దిక్కెవ్వరూ లేకపోవడంతో విమర్శలు వెలువెత్తుతున్నాయి.

- అధికారి లేకపోవడంతో మూతబడిన కార్యాలయం
- సెక్రటరీ పోస్టు భర్తీలో విద్యాశాఖ నిర్లక్ష్యం
- ప్రశ్నపత్రాల సరఫరాపై ఆందోళన



జిల్లా కేంద్రంలోని ఉమ్మడి పరీక్షల విభాగం కార్యాలయం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఫార్మేటివ్, సమ్మేటివ్ పరీక్షల నిర్వహణ, ప్రశ్నపత్రాల పంపిణీ, ఏటా పదో తరగతి విద్యార్థులకు సంకల్పం స్టడీ మెటీరియల్ అందజేయడంలో జిల్లా ఉమ్మడి పరీక్షల విభాగం శాఖ (డీసీఈబీ) కీలక పాత్ర పోషిస్తుంది. ఆ శాఖకు సీనియర్ హెచ్ఎంను సెక్రటరీగా నియమిస్తారు. గత నెల వరకు ఆ శాఖ సెక్రటరీగా విధులు నిర్వహించిన పరశురామనాయుడు ఉద్యోగ విరమణ చెందారు. ఆ తర్వాత ఇప్పటి వరకు ఇంకొకరిని నియమించడంలో జిల్లా విద్యాశాఖ అలసత్వం వహిస్తోంది. దీంతో క్షేత్రస్థాయిలో సమస్యలు ఏర్పడుతున్నాయి.

నూతన నియామకంలో అలసత్వం

జిల్లా వ్యాప్తంగా ఉన్న ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు ఫార్మేటివ్, సమ్మేటివ్ పరీక్షల నిర్వహణలో డీసీఈబీ సెక్రటరీ కీలకపాత్ర పోషిస్తారు. అలాంటి పోస్టును భర్తీ చేయడంలో జిల్లా విద్యాశాఖ ఎందుకు అలసత్వం వహిస్తుందో అని టీచర్లు గుసగుసలాడుతున్నారు. గత సెక్రటరీ జనవరిలో ఉద్యోగ విరమణ పొందారు. ఆ విషయం జిల్లా విద్యాశాఖ అధికారులకు సైతం తెలుసు. ముందస్తుగా కొత్త సెక్రటరీని నియమించేందుకు చర్యలు చేపట్టాల్సి ఉంది. అయితే జిల్లా విద్యాశాఖ అధికారులు రాజకీయ ఒత్తిళ్లను భరించలేక పోస్టును భర్తీచేయడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

కార్యాలయం మూత..

జిల్లా కేంద్రంలోని పీసీఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జిల్లా ఉమ్మడి పరీక్షల విభాగం సెక్రటరీ కార్యాలయం ఉంది. ఇక్కడి నుంచే కార్యకలాపాలు సాగిస్తారు. సమ్మేటివ్ విధానాన్ని అమలు చేసిన గత 4 సంవత్సరాల నుంచి జిల్లా ఉమ్మడి పరీక్షల విభాగంశాఖను బలోపేతం చేశారు. గతంలో సీనియర్ టీచర్లను అసెస్‌మెంట్ సభ్యులుగా సైతం నియమించారు. కార్యాలయ పనుల నిమిత్తం ఒక జూనియర్ అసిస్టెంట్‌ను కేటాయించారు. అయితే 18 రోజులుగా ఆ శాఖ సెక్రటరీ, జూనియర్ అసిస్టెంట్ ఎవరూ కూడా లేకపోవడంతో కార్యాలయం మూతపడింది. ఈ కార్యాలయం ఎప్పుడో తెరుస్తారోనని టీచర్లు ప్రశ్నిస్తున్నారు.

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల వివరాలు..

ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు	1,931
ప్రాథమిక పాఠశాలల్లోని విద్యార్థులు	56,452
ప్రాథమికోన్నత పాఠశాలలు	181
ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థులు	12,054
ఉన్నత పాఠశాలలు	354
ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు	85,685

ప్రశ్నపత్రాల సరఫరాపై సందిగ్ధం

జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలకు జిల్లా ఉమ్మడి పరీక్షల విభాగం నుంచే ప్రశ్నపత్రాలను సరఫరా చేయాల్సి ఉంటుంది. ఆరో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు నిర్వహించే సమ్మేటివ్ పరీక్షలకు ప్రశ్నపత్రాలను త్వరలో పంపిణీ చేయాలి. అదే విధంగా ఏటా పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఈ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యే కంగా సంకల్పం మెటీరీయల్ రూపొందిస్తారు. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయిస్తుంది. బడ్జెట్ లేని పక్షంలో కలెక్టర్ అనుమతితోనైనా మెటీరియల్‌ను రూపొందించాలి. అయితే ఈ ఏడాది ఎలాంటి మెటీరియల్‌ను రూపొందించకపోవడంతో విమర్శలు వెలువెత్తుతున్నాయి. సంకల్పం మెటీరియల్‌ను అన్ని సబ్జెక్టుల నిష్ణాతులు రూపొందించేవారు. ఆ మెటీరియల్ ను చదువుకునే వెనుకబడిన విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేవారు. ఆ మెటీరియల్ లేకపోవడంతో ఈ విద్యాసంవత్సరం పదో తరగతి ఫలితాలపై ప్రభావం చూపే అవకాశం ఉందని విద్యావేత్తలు వెల్లడిస్తున్నారు. ఈ విషయం పై విద్యాశాఖ అధికారులను సంప్రదిస్తుంటే నోరు మెదపడం లేదు.